ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
మంగళవారం | జులై 21, 2026 | సంపుటి : 7 | సంచిక : 46 | పేజీలు : 2

విప్రచిత్తా అలంకరణలో
అమ్మవారు
ఆరో రోజుకు చేరుకున్న శాకంభరీ ఉత్సవాలు

వరంగల్, ఆయుధం: వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు అరవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి "విప్రచిత్తా" నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని "మహావజ్రేశ్వరి" గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే వచ్చింది ఈ మనుష్య జన్మ పరోపకారార్థమిదం శరీరం అని శాస్త్రం చెబుతోంది. పరులకు ఉపకారం చేయాలంటే మన దగ్గర జ్ఞానం, ఐశ్వర్యం, అధికారం లేదా వృత్తి నైపుణ్యం ఈ నాలుగింటిలో ఎదోకటి ప్రధానంగా కలిగియుండాలి. ఈ నాలుగు కూడా నిరంతర సాధన కఠోర పరిశ్రమ చేస్తేనే గాని సమకూరవు, ప్రారబద్ధవశమున అసురీ శక్తులు జీవుడిలో అలసత్వం బద్ధకం రూపంలో ప్రవేశించి సాధనా మార్గం నుండి ప్రక్కకు తప్పించి ఆతతాయిగా మార్చి మానవ జీవితాన్ని వ్యర్థపరుస్తాయి. మానవ జన్మ సార్థకం కావాలంటే సాధనా సంపత్తి కావాలి. జీవుడు సాధనలో నిమగ్నం కావాలంటే ఈ అసురీ శక్తులు దూరం కావాలి. అందుకు జగన్మాత అనుగ్రహం కావాలి. విప్రచిత్తా అమ్మవారు బ్రాహ్మణుల బుద్ధియందు ప్రవేశించి బ్రాహ్మణులు వేదోక్త తత్త్వజ్ఞానంతో కూడిన వేదవిహిత కర్మలను ఆచరించే విధంగా చేసి తద్వారా అగ్నిష్టోమాది శ్రోతయాగాలు జరుపుచూ తద్వారా సకల జనులు తరించే విధంగా చేస్తుంది. అట్లాగే మహావజ్రేశ్వరీ మాత సాధకుడి సంకల్పాలను వజ్రసంకల్పంగా ధృఢతరం చేసి మనిషిని సాధనలో కృతకృత్యుణ్ణి చేసి అశ్మోద్ధరణ జరుపుతుంది. అపుడు జీవుడు తాను తరిస్తూ పదిమందిని తరింపజేస్తాడు. ఈ విధంగా లోకకళ్యాణం జరుగుతుంది. జగన్మాత ఆరాధన వల్ల అని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారి దర్శనమునకు భక్తులు సాంప్రదాయమైన దుస్తులతో రావాలని, దేవాలయము, దేవాలయ ప్రాంగణంలో యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ వీడియోలు, రీల్స్ చేయుట నిషేధించుట జరిగిందని అందుకు భక్తులు సహకరించాలని రామాల సునీత కోరారు.

అయోధ్య విరాళాల కేసును
రాజకీయం చేయొద్దు
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

2

అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్
- కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే
- మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు
- ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెప్పారు.
- సరైన ప్రణాళిక లేకుండా ప్రభుత్వం పనిచేస్తోంది

2

'సర్' పేరిట
బీజేపీ ఓట్ల తొలగింపు
- బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు

ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు ఫిర్యాదులు, అక్రమాలు, ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ ప్రతినిధి బృందం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించింది.

2

ప్రజావాణికి 268 ఫిర్యాదులు

హనుమకొండ, ఆయుధం: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 268 ఫిర్యాదులను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ పోర్టల్ లో పరిశీలించాలని, పరిష్కార చర్యలు సంబంధిత శాఖల అధికారులు చేపట్టాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉండకుండా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, జెడ్పి సీఈవో శేషాద్రి, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కుంగిన కాళేశ్వరానికి బాధ్యులెవరు?
మనిషికి గుండెలాగే కాళేశ్వరానికి మేడిగడ్డ

- మేడిగడ్డ పనిచేయకపోతే కాళేశ్వరం పని చేయదు
- ఎన్డిఎస్ఏ సూచనలు మాత్రమే ప్రభుత్వం పాటిస్తుంది
- ఎల్‌నినో తో దేశవ్యాప్తంగా వర్షా భావ పరిస్థితులు
- కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందని హరీష్ రావు అంటున్నారు
- బాధ్యతాయుతమైన వ్యక్తి దిగజారి మాట్లాడటం సరైంది కాదు
- దేశంలో ఏ నదిలో కూడా ఆశించిన స్థాయి నీటి ప్రవాహం లేదు
- రైతులు వాస్తవాలు గ్రహించి ఆరుతడి పంటలు వేసుకోవాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘనపూర్, ఆయుధం: 'కన్నెపల్లి నుండి నీటిని ఎత్తి అన్నారం నింపండి.. ఏమైనా బాధ్యత మేము తీసుకుంటాం' అని మాట్లాడుతున్న హరీష్ రావు మీ హయాంలోనే కుంగిన కాళేశ్వరానికి ఎవరు బాధ్యత తీసుకుంటారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎల్ నీనో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయని, దేశంలో ఏ నదిలో కూడా ఆశించిన నీటి ప్రవాహం లేదని తెలిపారు. కరువు పరిస్థితుల దృశ్య రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందని మాట్లాడుతున్నారని ఒక బాధ్యతయుతమైన వ్యక్తి ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడటం సరైంది కాదని అన్నారు. బిఆర్ఎస్ మెడిగడ్డ కుంగిపోతే కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయచ్చు కదా అంటున్నారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉందని, 16వేల క్యూసెక్కుల ప్రవాహంతో నీటి ఎత్తిపోయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. నీటిని ఎత్తిపోయాలి అంటే కనీసం 2లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండలాని నీటి పారుదల నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. ఒకవేళ కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేసినా మళ్ళీ అన్నారం అక్కడి నుండి సుందిళ్లకు లిఫ్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కానీ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అన్నారం, సుందిళ్లలలో నీటిని నిల్వ చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు రాష్ట్ర ప్రభుత్వం పాటించాల్సిందేనని వెల్లడించారు.

'మీరు నీటిని లిఫ్ట్ చేయండి ఏం జరిగినా బాధ్యత మేము తీసుకుంటాం' అని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారని కానీ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగి పోవడానికి ఎవరూ బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. జరిగిన దానికి బాధ్యత వహించకుండా జరగబోయేదానికి బాధ్యత వహిస్తాం అనడం సిగ్గుచేటని విమర్శించారు. కుంగిన కాళేశ్వరానికి బాధ్యత మాదేనని కేసీఆర్, హరీష్ రావు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. పైగా పాదయాత్రలు చేస్తామంటున్న నాయకులు ఏ మొహం పెట్టుకొని పాదయాత్రలు చేస్తారని విమర్శించారు. 10ఏళ్ళు అధికారంలో ఉండి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వేంటేనే 70వేల ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేసి నియామక పత్రాలు అందించిందని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చి వదిలేదిన వాళ్ళు, గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని మిగతా2లో..

కేయూ అభివృద్ధికి సహకరించండి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

హనుమకొండ, ఆయుధం: కాకతీయ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలకు గత మూడేళ్లలో కేంద్రం అందించిన ఆర్థిక, విద్యా, పరిశోధన సహాయంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కడియం కావ్య వివరాలు కోరారు. అలాగే పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల అభివృద్ధి కోసం మంజూరైన, విడుదలైన, వినియోగించిన నిధుల వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా కాకతీయ యూనివర్సిటీకి రూసా 2.0 పథకం కింద రూ.50 కోట్ల నిధులను ఆమోదించినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ తెలిపారు. 'రిసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్' విభాగంలో ఈ నిధులు మంజూరయ్యాయని, పరిశోధనా కేంద్రాలు, ఇన్నోవేషన్ హబ్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉపాధి కల్పనకు సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధికి వీటిని వినియోగించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన తాజా నివేదిక ప్రకారం ఇప్పటికే రూ.28.56 కోట్లు విడుదలైనట్లు తెలిపింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, కాకతీయ యూనివర్సిటీ తెలంగాణలో కీలక విద్యా సంస్థ అని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని అన్నారు. నిధుల విడుదలతోనే బాధ్యత ముగిసిపోదని, వాటిని సకాలంలో పూర్తిగా వినియోగించి పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల సామర్థ్యాల పెంపునకు ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ యూనివర్సిటీకి మరింత కేంద్ర సహకారం అందేలా తన ప్రయత్నాలు కొనసాగిస్తానని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.

4 కోట్ల డౌన్‌లోడ్‌లు దాటేసిన ఆధార్ యాప్

జాతీయం, ఆయుధం: ఆధార్ సంబంధిత సేవల కోసం ఎంఆధార్ యాప్ స్థానంలో తీసుకొచ్చిన కొత్త ఆధార్ యాప్ 4 కోట్ల డౌన్‌లోడ్ మార్క్‌ను దాటింది. కొత్త ఆధార్ యాప్ ద్వారా సుమారు 49 లక్షల మొబైల్ నంబర్లు, 11.65 లక్షల చిరునామాలు, 12.5 లక్షల ఇమెయిల్స్ అప్‌డేట్ అయ్యాయని కేంద్రం వెల్లడించింది. బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్ ఫీచర్‌ను 1.91 కోట్ల సార్లు వినియోగించుకున్నట్లు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రతి అర్హత కలిగిన ఓటును
కాపాడటమే లక్ష్యం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బీఎల్ఏలు గడప గడప ప్రచారం నిర్వహించాలి
- జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం..
- ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమీక్ష

2

గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు
- బల్దియా కమిషనర్ టి.వెంకన్న
- వివిధ విభాగాలకు చెందిన 128 ఫిర్యాదుల స్వీకరణ
- ఫిర్యాదుల నిర్లక్ష్యం పట్ల అసహనం వ్యక్తం చేసిన కమిషనర్

వరంగల్, ఆయుధం: గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం లో జాప్యాన్ని సహించేది లేదని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ స్థానిక అంశాల సమస్యల పరిష్కారం కోసం నగర ప్రజలు అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పన్నుల, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, డిఆర్ఎఫ్ విభాగాల గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కార తీరును కమిషనర్ సమీక్షించి మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం లో ఆశించిన పురోగతి లేదని ప్రతి వారం స్వీకరించిన ఫిర్యాదులు ఖచ్చితం గా పరిష్కారం కావాలని, ఫిర్యాదులు పెండింగ్ లో ఉంటే సహించేది లేదని అన్నారు. ఫిర్యాదు తీరును బట్టి అధికారులు ప్రజా క్షేత్రంలో పరిశీలించి వాస్తవాల నిర్ధారణ ఆధారంగా పరిష్కారం చూపాలని ఆయా విభాగాల లాగిన్ లలో ఫిర్యాదులు పేరుకుపోకుండా వెంటనే పరిష్కారం చూపాలని, శానిటరీ ఇన్స్పెక్టర్ లు, శానిటరీ సూపర్ వైజర్ లకు శానిటేషన్ అంశాల పురోగతిపై ఇటీవల సూచనలు చేయడం జరిగిందని వాటిని తూ.చా తప్పకుండా పాటించి శానిటేషన్ నిర్వహణ పై సమగ్ర అవగాహన ఏర్పరచుకొని అదే తీరును నిరంతరం కొనసాగించాలని కమిషనర్ సూచించారు.

కాగా, గ్రీవెన్స్‌లో టౌన్ ప్లానింగ్ విభాగానికి 58 వినతులు, ఇంజనీరింగ్ విభాగానికి 38, రెవిన్యూకు 13, హెల్త్ & శానిటేషన్ 9, నీటి సరఫరా 9, హార్టికల్చర్ 1, చొప్పున మొత్తం 128 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్ కుమార్, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిపి రవీందర్ రాదేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ఓ లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో ఎస్ఐఆర్

వరంగల్, ఆయుధం: వరంగల్ 23వ డివిజన్ పరిధిలో SIR ఓటర్ నమోదు శాతాన్ని పెంచాలని మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని 3వ బూత్ లో బీఎల్‌వో గీత 11వ బూత్ బీఎల్‌వో మంజులతో కలిసి SIR ఫారంలు నింపుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. అదే విధంగా బీఎల్‌వోల వద్ద ఉన్న ఫారంలను DEATH లు SHIFT అయిన వాటిని పరిశీలించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు బాషాకర్ల హరికృష్ణ, లక్కర్స్ మొగిలి, గుళ్ళే పెల్లి రాము, పాల్గొన్నారు.

కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, ఆయుధం: ఆగస్ట్ 6 నుంచి 12 తేదీవరకు జరగనున్న కాజీపేట హజ్రత్ సయ్యద్ షా ఖాద్రీ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఆర్టీసీ, తాగునీటి సరఫరా, ఇతర శాఖల అధికారులు పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని, అలాంటి పరిస్థితుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. దర్గా రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్నందున భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైల్వే అధికారులు, సంబంధిత స్టేషన్ గేట్ మాస్టర్లు ఉత్సవాల రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండి రైళ్ల రాకపోకల సమయంలో సమన్వయం పాటించాలని సూచించారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని నియమించాలని కోరారు.

అయోధ్య విరాళాల కేసును రాజకీయం చేయొద్దు: సుప్రీం కోర్టు

ఢిల్లీ, ఆయుధం: అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయొద్దని పిటిషనర్లకు హితవు పలికింది. కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని వ్యాఖ్యానించింది. ఇది కేవలం ఓ నేరానికి సంబంధించిన అంశం మాత్రమేనని, సరైన దర్యాప్తు జరిగేలా చూస్తామని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. యూపీ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారా? అని సీజేఐ ప్రశ్నించారు. డీజీపీతో చర్చించి సిట్ ఏర్పాటు చేయొచ్చో లేదో నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిందని, యూపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తులో తేలిన విషయాలను కోర్టుకు తెలియజేయాలంటూ కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 27కి వాయిదా వేసింది.

మరోవైపు సిట్ దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఆ నేపథ్యంలోనే శ్రీరామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. మరోవైపు ఈ కేసును సీబీఐ, కాగ్‌తో విచారణ జరిపించాలని డిమాండ్లు కూడా వస్తున్నాయి.

అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్

హైదరాబాద్, ఆయుధం: కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని.. పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతోపాటు కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

''కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. మోటార్లు కాలిపోతున్నాయి. రైతులకు యూరియా అందించలేకపోతున్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవి. రూ.2లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. 3040 శాతమైనా పూర్తిచేశారా? ఒక్క ఊరిలో అయినా వందశాతం రుణమాఫీ చేసినట్లు నిరూపించాలని సీఎం రేవంత్‌కు అసెంబ్లీలోనే సవాల్ విసిరా. కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశారు. కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే అని ప్రజలకు తెలిసిపోతుందనే రేవంత్ నీళ్లు వదలడం లేదు. మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు? ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెబితే.. ప్రభుత్వం ఇప్పుడు సమీక్షలు చేస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా సీఎం పనిచేస్తున్నారు'' అని కేటీఆర్ విమర్శించారు.

'సర్' పేరిట బీజేపీ ఓట్ల తొలగింపు

- **బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు**

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణ రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో నేతలు కలిశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 'సర్'పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాతబస్తీలో సర్ నిర్వహణకు సీనియర్లకు బాధ్యత అప్పగించాలని రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారంటూ సీఈవోకు ఆయన ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కై అనర్హులను చేరుస్తున్నారని ఆరోపించారు. ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చినవారికి ఓటు హక్కు లేకుండా చేస్తున్నారని సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

కుంగిన కాళేశ్వరానికి బాధ్యులెవరు?

(మొదటి పేజీ తరువాయి..)

వాళ్ళు, గ్రూప్ 1పేపర్ లీకేజికి పాల్పడిన వాళ్ళు ఈ రోజు యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చి పదిలేసింది ఎవరో... నియామకాలు పూర్తి చేస్తుంది ఎవరో యువత ఆలోచించాలని కోరారు.

10ఏళ్ల అధికారంలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుందని ఆరోపించారు. 2014ముందు ఎంత ఉంది...? ఇప్పుడు ఎంత ఉందని ప్రశ్నించారు. వేల కోట్ల ఆస్తులు, వందల ఎకరాల భూములు, ఫామ్ హౌస్ లు ఎక్కడినుండి వచ్చాయని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న 1400 కోట్లు క్విడ్ ప్రొకో ద్వారా వచ్చినవే అని వాటిని ఉద్యమకారులకు పంచాలని స్వయంగా కేసీఆర్ బిడ్డ కల్వకుంట్ల కవిత గారే డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. పైగా హరీష్ రావు నీటి పారుదల మంత్రిగా విపరీతమైన అవినీతికి పాల్పడ్డడని ఇప్పుడు మళ్ళీ దోచుకోవడానికే ప్రాజెక్టులు అడుగుతున్నాడని అంటోందని అన్నారు. హరీష్ రావు, బిఆర్ఎస్ నాయకులు ముందుగా కవిత మాటలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయామనే అక్కసుతో సభ్యత, సంస్కారం మరచి మాట్లాడుతున్నారని, కొన్ని పత్రికలు, యుట్యూబ్ చానళ్ళు పెట్టుకొని ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ రైతులను, ప్రజలను, యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్లను దేవాదుల ద్వారా నింపే ప్రయత్నం చేస్తున్నానని వారం రోజుల్లో రైతులకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. యువత, రైతులు, ప్రజలు బిఆర్ఎస్ చెప్పే మాయ మాటలు నమ్మవద్దని, మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యం

- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **జీఎల్‌పలు గడప గడప ప్రచారం నిర్వహించాలి**
- **జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం..**
- **ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ విస్తృత సమీక్ష**

హనుమకొండ, ఆయుధం: గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రతీ అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, ఎస్ఐఆర్ బూత్ ఇన్‌చార్జ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎస్ఐఆర్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. రాబోయే రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ (BLA) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గడప గడప ప్రచారం నిర్వహించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన దరఖాస్తులు పూర్తి చేయించాలని సూచించారు.

"పార్టీలో పని చేసే వారికే గుర్తింపు, అవకాశాలు, పదవులు వస్తాయి. సీనియర్ అనే పేరుతో పని చేయకుండా కూర్చుంటే అవకాశాలు రావు. ప్రజల మధ్య ఉండి పార్టీ కోసం కష్టపడిన వారినే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అదే విశ్వాసంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే స్థాయిలో పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇ వి శ్రీనివాస్ రావు, పలువురు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, SIR బూత్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఎంజీఎంను సందర్శించిన వరంగల్ సీపీ

వరంగల్, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సోమవారం వరంగల్ యం.జి.యం హాస్పటల్ ను సందర్శించారు. సోమవారం యం.జి.యంకు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి వివరాలను నమోదు చేసే రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డీ అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందు.. వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా యం.జి.యం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబందించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యం.జి.యం లో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం.ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్, ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు వున్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 38వ అధ్యక్షుడిగా వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం

వరంగల్, ఆయుధం: వరంగల్ హంటర్ రోడ్‌లోని పీఆర్ఆర్ వేడుకల మందిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 38వ అధ్యక్షుడిగా సోమ వేణుగోపాల్, కార్యదర్శిగా నాయిని అనిల్ కుమార్, కోశాధికారిగా జూలూరి కృష్ణమూర్తి ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులు మాట్లాడుతూ.. సంవత్సర కాలానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా దాత నాయిని ఫౌండేషన్ చైర్మన్ నాయిని అనిల్ కుమార్ ఐదు కుట్టు మిషన్లు ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పాఠశాలకు ఐదు సీలింగ్ ఫ్యాన్లు, ములుగు జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు రెండు బీరువాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.హరిహర ప్రసాద్, డా.సి.శరత్ బాబు హాజరై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో రోటరీ సంస్థ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. రోటరీ సభ్యులు తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తూ పేదలకు కుట్టు మిషన్లు, ప్రభుత్వ పాఠశాలలకు సైకిళ్లు, వాటర్ ప్లాంట్లు, అనాథాశ్రమాలకు మంచాలు, నిత్యావసర వస్తువులు అందిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలన కోసం నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రోటరీ కీలక పాత్ర పోషిస్తూ విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు ఏజీ పోరండ్ల రత్నాకర్ రావు, మాదూరి గణేష్, భేతి అశోక్ బాబు, తోట సంపత్, శ్రీకర్, వినయ్ ప్రసాద్, కోరే చంద్రమౌళి, పొన్న హరినాథ్, బండారు కుమారస్వామి, మొగిలి చంద్రతో పాటు హనుమకొండ, వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్ రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

25న నాగన్న సంతాప సభ

వరంగల్, ఆయుధం: సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ నాగన్న సంతాప సభ ను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ప్రజాసంఘాల నాయకులు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న సంతాప సభ ఈనెల 25వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పి వేణు అధ్యక్షత వహిస్తారని ప్రముఖ కవి సతీష్ చందర్ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.వి చలపతిరావు, నాయకులు ఆవునూరి మధు, ప్రొఫెసర్ వినయ్ బాబు, తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో తమిళనాడు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ విప్లవ సాంస్కృతిక సంఘాల కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సభను జయప్రదం చేయాలని సాంస్కృతిక, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్ టియు నగర కార్యదర్శి బన్న నర్సింగం, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గంధ్రతి హరిబాబు, పిడిఎస్ యు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మన్నే కరుణాకర్, బండి వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**
- **పోలీస్ రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాసరెడ్డి**

రఘునాథపల్లి, ఆయుధం: ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడబెల్లి శ్రీనివాస్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ యాదవ్ కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ... ప్రజలు దూరప్రాంతాలకు వెళ్ళేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంకులో పెట్టాలని... ఊరికి వెళ్లేటప్పుడు ఇంటి పక్క వారికి సమాచారం ఇవ్వాలని ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలని వారు కోరారు. సైబర్ క్రైమ్ మోసానికి గురైన వెంటనే 1930 నెంబర్ కు సంప్రదించి సాయం పొందాలని వారి కోరారు. గ్రామాల వారిగా దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు రాత్రి వేళలో గస్తీలు తిరుగుతున్నారని ఎక్కడైనా దొంగతనం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందిచాలని కోరారు. వాహనదారులు ద్విచక్ర వాహనదారులు ఇంటి వద్ద పెట్టేటప్పుడు వాటికి తాళం వేసుకోవాలని కోరారు.

అడుప మహేష్ పార్థివ దేహానికి ఎమ్మెల్యే నాయిని నివాళి

వరంగల్, ఆయుధం: వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సేవలందించిన అడుప మహేష్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా, ఆయన పార్థివ దేహానికి కె.ఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఆయూబ్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి మహేష్ పార్థివదేహానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అడుప మహేష్ చూపిన అంకితభావం, నిబద్ధత, సోషల్ మీడియా విభాగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు మొదటి పాఠశాలలు

- **తొలి గురువులు అంగన్వాడీ టీచర్స్: డాక్టర్ అనితా రెడ్డి**

హనుమకొండ, ఆయుధం: అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి హన్మకొండలోని శాయంపేట అంగన్వాడీ కేంద్రం సందర్శించి పిల్లల బాగోగులు అడిగి తెలుకున్నారు. పిల్లల కోసం బొమ్మలు, ఆట వస్తువులు అందించారు. పిల్లలతో కాసేపు గడిపి.. వారితో పాటు ఆటలు ఆడుతూ పిల్లలను సంతోష పెట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చిన్న పిల్లల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని.. వాటిని వినియోగించుకోవాలని అన్నారు. పిల్లలు సెంటర్ కి చక్కగా రావాలంటే బొమ్మలు ఎంతో ఆకర్షించి వారు వచ్చేలా చేస్తాయని అందుకే పిల్లలకు బొమ్మలు అందించానని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు మొదటి పాఠశాలలు అయితే.. తొలి గురువులు అంగన్వాడీ టీచర్స్ అని పేర్కొన్నారు. టీచర్లు ఆటపాటలతో చదువు చెప్పాలని, అమ్మలా ప్రేమ ని పంచుతూ మంచి మాటలు మంచి అలవాట్లు మంచి నడవడిక నేర్పించాలని డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. ప్రభుత్వ పథకాలకు ప్రజల సహకారం ఉంటేనే సమాజం, తోటివారు అభివృద్ధి చెందుతారని.. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ప్రైమరీ సూల్ హెడ్ మాస్టర్ ఉప్పలయ్య, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- **అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు**

ములుగు, ఆయుధం: ప్రజావాణి లో వచ్చిన పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 22, ఇందిరమ్మ ఇండ్లు 18, పెన్షన్ 17, ఇతర శాఖలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైని కలెక్టర్ కుషీల్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మండల జగన్నాథం మృతికి పలువురి నివాళి

వరంగల్, ఆయుధం: వరంగల్ రామన్నపేట ప్రాంతానికి చెందిన మండల జగన్నాథం (96) సోమవారం తన నివాసంలో మృతిచెందారు. జగన్నాథం కు భార్య, ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. జగన్నాథం కురుమ 60 ఏళ్లకు పైగా సైకిల్ మీద ఉన్నితో తయారుచేసిన గొంగళ్లను విక్రయించేవారు. రాష్ట్రంలోని కురుమలు నివసించే వివిధ జిల్లాలలోని గ్రామాలలో గొంగల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగించారు. జగన్నాథం మరణ వార్త తెలియగానే వివిధ జిల్లాల, గ్రామాల నుంచి తండోప తండాలుగా విచ్చేసి వారి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మండల సత్తయ్య, ఈర సదానందం, మండల మొగిలి, జిగురు రవి, మండల సురేష్, బండారి మల్లేశం, మండల శంకర్, కంచ మల్లయ్య, మండల కుమార స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరిగే శ్రీను, మండల నరసింహ రాములు, తదితరులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695